ప్రజాశక్తి
శనివారం 9 ఆగస్టు 2025
5
శ్రీ సత్యసాయి

ధర్మవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మార్గదర్శకులేరీ..?!



- బంగారు కుటుంబాలకు దాతలు కరువు
- జిల్లావ్యాప్తంగా 54,602 కుటుంబాలు గుర్తింపు
- గుర్తించిన మార్గదర్శకులు 4209
- దత్తత తీసుకున్నది 23,218
- 31,384 కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకం
- అధికారులపై ఒత్తిడి భారం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-హిందూపురం

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఆర్థికంగా భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పి-4 విధానం క్షేత్రస్థాయిలో ఫలితాలివ్వడం లేదు. పబ్లిక్, ప్రయివేటు పీపుల్స్ పార్టనర్షిప్ (పి-4) లక్ష్యం చేరడం కష్టతరంగా మారింది. జిల్లాలో పి-4కు ప్రణాళిక రూపొందించినప్పటికీ అమలుకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో హిందూపురం పట్టణంతో పాటు హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మూడు రూరల్ మండలాలు ఉన్నాయి. హిందూపురం పట్టణంలో 43 సచివాలయాల పరిధిలో 3245 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఈ కుటుంబాల పరిధిలో 10.248 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 161 మంది మార్గదర్శకులు 243 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 54,602 కుటుంబాలు ఉన్నాయి. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పి-4 చేపట్టి మూడు నెలల క్రితం సర్వే పూర్తి చేసింది. ఈ సర్వేలో 54,602 బంగారు కుటుంబాలను గుర్తించారు. జిల్లాలో 544 సచివాలయాల పరిధిలో 64,940 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించారు. ఈ కుటుంబాల పరిధిలో సుమారు 1,56,99 మంది జనాభా ఉన్నారు. వీటితో పాటు 4209 మంది మార్గ దర్శకులను గుర్తించారు. నాలుగు రోజుల క్రితం వరకు పరిశీలిస్తే కేవలం 23,218 కుటుంబాలనే దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులు ముందుకొచ్చారు. మిగిలిన 31,384 బంగారు కుటుంబాల కోసం మార్గదర్శకుల కోసం అధికారుల అన్వేషణ కొనసాగుతోంది.

మార్గదర్శకులను వెతికే పనిలో అధికారులు

మార్గదర్శకులను వెతికే పనిలో అధికారులు నిమగ్నమైనప్పటికీ తీసుకున్న లక్ష్యానికి, ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు సమకూర్చిన దాతలకు పొంతన లేకుండాపోయింది. ఒకపక్క జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షలు చేస్తున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు క్షేత్రస్థాయిలో కన్పించడం లేదు. కొంతమందిని బలవంతంగా ఒప్పిస్తున్నారనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు లక్ష్యాన్ని చేరుకోవడానికి నానావస్థలు పడుతున్నారు.

నామమాత్రంగా ప్రజాప్రతినిధులు స్పందన

జిల్లాలో ప్రజాప్రతినిధులు పి-4ను తేలిగ్గా తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి-4ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెద్దగా లేదనే విమర్శ ఉంది. జిల్లా అధికార యంత్రాంగం అంతా పి-4పై కుస్తీ పడుతుంటే ప్రజాప్రతినిధులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడట్లేదని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నీరుగారే పరిస్థితి కన్పిస్తోంది.

పి-4 మార్గదర్శుల దత్తతపై ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న హిందూపురం మున్సిపల్ కమిషనర్(ఫైల్‌ఫోటో)

అధికారుల మెడపై కత్తి..!

పి-4 విజయవంతానికి ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లాలో 33 మండలాలకు 33 మంది ప్రత్యేక అధికారులను నియమించగా, మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమిషనర్కు బాధ్యత అప్పగించారు. ప్రత్యేక అధికారులు బంగారు కుటుంబాల గుర్తింపుతో పాటు మార్గదర్శకుల వివరాల సేకరణకు చర్యలు చేపడుతున్నారు. గ్రామస్థాయి కమిటీలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. మండలస్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఈఓ, మండల వ్యవసాయాధికారి, ఇతర అధికారులతో కమిటీ నియమించారు. వీరందరూ దాతలను గుర్తించి వారితో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ఒప్పించాలి. ఈ ప్రక్రియ అంత ఆశాజనకంగా జరక్కపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నేరుగా అధికారులు, ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనే ఆదేశాలు రావడం కూడా అధికారుల్లో నిరుత్సాహాన్ని నింపుతోంది. ఇటీవల హిందూపురం మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బంగారు కుటుంబాల దత్తత విషయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ ఆదేశాలు ఇచ్చారు. కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతుంటే బంగారు కుటుంబాలను ఎక్కడ దత్తత తీసుకోవాలంటూ ఉపాధ్యాయులు సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు.

మరోసారి పి-4 సర్వే

జిల్లావ్యాప్తంగా 54,602 కుటుంబాలను గుర్తించినప్పటికీ మరోసారి పి-4 సర్వే నిర్వహిస్తున్నారు. బంగారు కుటుంబాల జాబితాలో అనర్హులు ఎవరైనా చేరారా, లేక అర్హులు చేరలేదా అనే అంశాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాల సంఖ్యను వివిధ కారణాలతో తగ్గించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రచారం సాగుతోంది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు, గ్రామపెద్దలు, రిటైర్డ్ ఉద్యోగులను గ్రామాలు, పట్టణాలవారీ ఎంపిక చేసి బంగారు కుటుంబాలతో సమావేశాల నిర్వహణకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి కావాలని ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.

అధికారం కోసం ఓట్ల తొలగింపు

బీహార్‌లో ఎన్డీఏ కూటమి దుశ్చర్య
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

బీహార్ రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టేందుకు అక్కడి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 80 లక్షల మంది ఓటు హక్కును జాబితా నుంచి తొలగించే దశ్చర్యకు పాల్పడిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. బీహార్ రాష్ట్రంలో ఓటర్ల రద్దును నిరసిస్తూ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణం అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో గెలవాలన్న ఉద్దేశంతో బిజెపి దాదాపుగా 80 లక్షల మంది ఓట్లను గల్లంతు చేసిందన్నారు. గల్లంతైన ఓటర్లలో ఎక్కువమంది బడుగు, బలహీన, బిసి, మైనార్టీలు ఉన్నారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తారన్న కారణంతో వీరందరి ఓట్లను కావాలనే తొలగించారన్నారు. అర్హులైన ఓటర్ల జాబితా నుంచి తొలగించి అక్కడి అధికార ఎన్డీఏ కూటమి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని దయ్యబట్టారు. తొలగించిన ఓటర్ల వివరాలను సుప్రీంకోర్టుకు అందించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించకుండా సమయం సరిపోదని తెలపడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఓట్ల గల్లంతు వ్యవహారంలో ఆ రాష్ట్ర అధికార పార్టీ హస్తం ఉందన్న విషయం తేటతెల్లం అయ్యిందన్నారు. ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే ఇలాంటి చర్యలను ఎన్డీఏ కూటమి మానుకోవాలని తెలియజేశారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికల కమిషన్ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఈఎస్.వెంకటేష్, జెడ్పీ శ్రీనివాసులు, దిల్షాద్, లక్ష్మీనారాయణ, ఎ.మారుతి, జేవీ.రమణ,ఎల్ ఆదినారాయణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో లైంగిక వేధింపులు..?!

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర పాలక కార్పొరేషన్ కార్యాలయంలో ఓ ఉద్యోగినిపై సహచర ఉద్యోగి లైంగిక వేధింపుల పర్వం కలకలం రేపుతోంది. సదరు ఉద్యోగి వేధింపులు అధికం కావడంతో మహిళా ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గడిచిన మూడు నెలల కాలం నుంచి తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని మహిళా ఉద్యోగినికి ఫోన్ సందేశాలను అదే కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగి పంపుతున్నారు. మద్యం అలవాటు ఉన్న ఆ ఉద్యోగి ప్రతి రోజూ ఇలా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆ తాగుబోతు ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో తన సహ ఉద్యోగిని పెళ్లి చేసుకుంటానని చెప్పినట్లు సమాచారం. ఇది తెలుసుకున్న ఆ ఉద్యోగి కుమారుడు ఆగ్రహంతో తన తండ్రి సహ ఉద్యోగికి ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారం కార్పొరేషన్‌లో చర్చకు దారి తీయడంతో మహిళా ఉద్యోగి ఈ సమ్యను తన విభాగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తనకున్న సమస్యలు చాలవన్నట్లు ఈ వేధింపుల కారణంగా మరింత ఇబ్బందులు పడుతున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తామని ఉన్నతాధికారులు ఆమెకు తెలియజేశారు. ఇదే క్రమంలో వేధింపుల వ్యవహారంపై మహిళా ఉద్యోగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల వ్యవహారం కాకుండా ఈ విషయం బయటకు పొక్కకుండా విచారణ చేస్తున్నారు.

గతంలో సైతం ఇదే విభాగానికి చెందిన ఓ ఉద్యోగి ఇలాంటి వివాదాలతో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. కొన్ని రోజుల తర్వాత ఆయన పొరుగు జిల్లాకు బదిలీపై వెళ్లారు ఓ ఉన్నతాధికారి సైతం నేరుగా ఓ ఉద్యోగితో సంబంధాలు కలిగి ఉన్నారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీనికి తోడు సచివాలయ మహిళా ఉద్యోగులతో ఒక సమావేశంలో దుర్భాషలాడటం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. మరో విభాగంలో మహిళ ఉద్యోగి ఉన్నతాధికారి నుంచి వేధింపులు ఎదుర్కొని తీవ్ర ఇబ్బందులు పడినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్‌లో ఇలాంటి వేధింపుల పర్వానికి కళ్లెం వేసేలా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకునేలా నిర్ణయాలు చేయాలని ఉద్యోగుల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతోంది.

పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక ప్రచారంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు శుక్రవారం వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. జడ్పీటీసీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్న మారెడ్డి లతారెడ్డికి మద్దతుగా పులివెందుల మండలంలోని ఆర్.తుంపలపల్లి ఎస్సీ కాలనీలో ప్రచారం చేశారు. స్థానిక నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, ఎన్నికల కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. లతారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మారెడ్డి లతారెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ఉమ్మడి అనంత పురం జిల్లా ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పులివెందులలో జడ్పిటిసి ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, టిడిపి నాయకులు

ఘనంగా రాయలు పట్టాభిషేక మహోత్సవం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు 516వ పట్టాభిషేక మహోత్సవాన్ని బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఎస్‌కెడి సర్కిల్‌లోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ర్యాలీగా వై జంక్షన్ వద్ద ఉన్న రాయలు కాంస్య విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు జయంతి మహోత్సవాన్ని ఏటా ప్రభుత్వమే నిర్వహించాలని, శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొండపై శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఎకరం భూమి కేటాయిస్తే అందులో పార్కు, కళ్యాణమండపం ఏర్పాటు చేసుకుంటామన్నారు. బలిజ కులస్తులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేసి రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, బలిజ కులస్థులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఆంగ్లేయులను తరమడంలో 'క్విట్ ఇండియా' పాత్ర కీలకం

ప్రజాశక్తి-పెనుకొండ

క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్రోద్యమానికి తలమానికం అని పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జెవివిఎన్.కేశవరావు పేర్కొన్నారు. రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో క్విట్ ఇండియా డే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమి కొట్టడంలో క్విట్ ఇండియా కీలక పాత్ర పోషించిందన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.జయప్ప మాట్లాడుతూ విదేశీ వస్తు బహిష్కరణ ద్వారా స్వదేశీ వస్తు ఉత్పత్తికి ఆదరణ పెరిగిందన్నారు. ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ యశోద రాణి మాట్లాడుతూ విజయమో వీరస్వర్గమో అని పిలుపునిచ్చి స్వాతంత్రోద్యమంలో మన నాయకులు కీలక పాత్ర పోషించా రన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు పిఎల్.కాంతారావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమం చివరలో సాగిన క్విట్ ఇండియా ఉద్యమమే మనకు ఎంతో స్ఫూర్తి నిచ్చిందని, ఈ ఉద్యమం ద్వారానే స్వాతంత్ర్య అంకురార్పణ జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కేశవరావు

బిటిపిలో 1800 క్యూసెక్కుల నీరు చేరిక

ఆనందంలో ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కళ్యాణదుర్గం, రాయదుర్గం రెండు నియోజకవర్గాల్లోని ప్రజలకు తాగునీరు, ఆయకట్టుకు సాగునీరు అందించే ఏకైక ప్రాజెక్టు బైరువాని తిప్ప ప్రాజెక్ట్. ఐదు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు కర్నాటకలోని ఎగువ ప్రాంతం నుంచి ఈ ప్రాజెక్టుకు నీరు చేరడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు ఎగువ భాగాన కర్నాటకలో 16 చెక్ డ్యాంలు నిర్మించడంతో కర్నాటక నుంచి బిటిపికి నీరు అందవని భావించిన రెండు నియోజకవర్గాల్లోని ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్న సమయంలో శుక్రవారం ప్రాజెక్టుకు నీరు చేరడం శుభ పరిణామం. ఓ వైపు కూటమి ప్రభుత్వం చేపట్టిన కాలువ పూడిక తీత పనులు, మరోవైపు ప్రాజెక్టుకు నీరు చేరడం పట్ల ఈ ప్రాంతం రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలంటే ప్రాజెక్టుకు నీరు రావడమే ఏకైక వనరు. ఈ విషయంపై ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇరిగేషన్ నూతన జేఈ హరీష్ మాట్లాడుతూ ఇప్పటివరకు బైరవాని తిప్ప ప్రాజెక్టుకు 1800 క్యూసెక్కులు నీరు చేరిందని, భవిష్యత్తులో మరింత నీరు చేరే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఎగువన కర్నాటక నుంచి బిటిపికి ప్రవహిస్తున్న నీరు

నెర్రెలు చేలిన బిల్లా పబ్లిక్ పాఠశాల భవనం

శిథిలావస్థలో ఉన్న పాఠశాల రేకుల షెడ్డు

ఫీజులు ఘనం.. సౌకర్యాలు అధ్వానం

కనీస సౌకర్యాలకు నోచని 'బెల్లా' స్కూల్

ప్రజాశక్తి-పరిగి

స్థానిక శ్రీరంగరాజుపల్లి రహదారిలో ఉన్న బెల్లాపబ్లిక్ ప్రయివేటు పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఫీజులు మాత్రం అధికంగా వసూలు చేస్తున్న యాజమాన్యం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. పాఠశాలకు కనీస భవనాలు లేవు.రేకుల షెడ్డులోనే విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. వర్షం వస్తే తరచు నీరు లోపలికి రావడంతో విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా రేకుల షెడ్డు కావడంతో పై నుండి నీరు కారుతున్నడంతో విద్యార్థులు వర్షం నీటిలోనే కూర్చోనే పరిస్థితి నెలకొంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నామమాత్రంగా ఏర్పాటు చేసిన పాఠశాల గోడలు నాని నెర్రెలు తెలాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ సైతం మెసేజ్‌ల రూపంలో హెచ్చరిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత అధికారుల సైతం ఇలాంటి పాఠశాలలపై ముందస్తు చర్యల్లో భాగంగా పాఠశాలను ఖాళీ చేయించి అద్దె భవనాల్లోనైనా విద్యార్థులకు విద్యా బోధనలు చేసే విధంగా ఆదేశాలిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయప డుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే' ఏం లాభం అని అంటున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించే లోపు పాఠశాల భవనం మార్పునకు నిర్ణయం తీసుకునే ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు. నామమాత్రపు రేకుల షెడ్లలో విద్యాభ్యాసం చేస్తూ చిన్నారుల జీవితాలతో ఆడుకుంటూ విద్యను వ్యాపారంలా మార్చుకున్న ఇలాంటి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా టి-20 క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఎంఎస్ఆర్-జిటిఎస్ లెదర్ బాల్ టి-20 క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని అభిమన్యు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహిస్తున్నారు. తొలి మ్యాచ్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, అర్బన్ సిఐ నగేష్‌బాబు, న్యాయవాది రాధాకృష్ణ, అభిమన్యు యూత్ అసోసియేషన్ నిర్వాహకుడు నాగేంద్ర, లక్ష్మీనారాయణ టాస్ వేసి ప్రారంభించారు. సిఐ నగేష్‌బాబు, శ్రీనివాస్‌మూర్తి కొద్దిసేపు బ్యాటింగ్, బౌలింగ్ చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మొదట మడకశిర బీస్ట్ క్రికెటర్స్, హిందూపురం జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన మడకశిర బీస్ట్ జట్టు 18.3 ఓవర్లలో 121 పరుగులకు అలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు 15.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం మడకశిర స్టార్స్, మడకశిర-11 జట్లు తలపడ్డాయి. అభిమన్యు యూత్ అసోసియేషన్ నాగేంద్ర, సభ్యుల ఆధ్వర్యంలో క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మల్లికార్జున, డాక్టర్ కృష్ణమూర్తి, టిడిపి మండల కన్వీనర్ నాగరాజు, అసోసియేషన్ సెక్రటరీ నాగేంద్ర, వేణు, నాగరాజు, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, అర్బన్ సిఐ నగేష్‌బాబు, అభిమన్యు యూత్ అసోసియేషన్స్ సభ్యులు

నేడు కదిరిదేవరపల్లి-తిరుపతి రైలు రద్దు

ప్రజాశక్తి-రాయదుర్గం

కదిరిదేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే ప్యాసింజర్(57406) రైలు సర్వీసును ఈ నెల 9వ తేదీ (శనివారం) రద్దు చేసినట్లు నైరుతి రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్.శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైసూరు-బాగల్‌కోట్ ప్రత్యేక రైలు సర్వీసుకై కోచ్, కంపార్ట్‌మెంట్ అవసరమైనందున కదిరిదేవరపల్లి-తిరుపతి రైలును ఒక రోజు రద్దు చేయనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. రైలు ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు

సెలూన్లకు ఉచిత విద్యుత్‌పై హర్షం

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు ఉచిత విద్యుత్ అమలు చేయడంపై శుక్రవారం జిల్లా నాయీ బ్రాహ్మణుల సాధికారత కన్వీనర్ రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను 150 నుంచి 200 యూనిట్లకు పెంచడం హర్షణీయమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోజస్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డివిజన్ పరిధిలోని కదిరి మున్సిపాల్టీ, రూరల్ మండలం, తలుపుల, ముదిగుబ్బ, గాండ్ల పెంట, ఎన్ పి కుంట, ఓడిసి, నల్లమాడ మండలాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోజస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కాళసముద్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్ బైపిసి గ్రూప్‌లో బిసి కేటగిరిలో 2 సీట్లు, ఎస్సీ కేటగిరిలో 3 సీట్లు ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరింత సమాచారానికి 9440918075, 7799197661, 9052563773 నంబర్లకు సంప్రదించాలన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

కొత్తచెరువు మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లుగా ఎంపికైన షేక్ నిజాం, బుద్దల ప్రవీణ, వడ్డే మస్తానమ్మను టిడిపి, వడియ రాజుల సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలానికి చెందిన టిడిపి నాయకులు డాక్టర్ జాకీర్ అహ్మద్, బాలకృష్ణారెడ్డి, వడియ రాజుల సంఘం మండల అధ్యక్షుడు ఇడగుట్ట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు దండగల చెన్నకేశవులు, గౌరవ అధ్యక్షుడు వీరాంజనేయులు, సలహాదారు కుంచపు శ్రీనివాసులు తదితరులు శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మాట్లాడుతూ తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పల్లెసింధూర, మాజీ మంత్రి రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇర్షాద్, జయరాం రెడ్డి, గంగులప్ప, జై చంద్ర, విజయ కుమార్, వెంకట్ నారాయణ, వెంకటేష్, నాగరాజు, వైభవి అంజి, కుంచపు అంజి, గంగరాజు, చంద్ర, కేశవ, ఎం చెన్నకేశవులు, శివ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి పట్టణంలో సత్యసాయి భక్తులు ఘనంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద నుంచి గోకులం, గణేష్ సర్కిల్, ఉజ్వల సర్కిల్, దీన జనోద్ధారణ సర్కిల్, కుమార్ పేట మీదుగా ప్రశాంతి నిలయానికి 7 కిలోమీటర్లు తిరిగి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశీ భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తెలుగుయువత నాయకులు స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పుట్టపర్తికి చెందిన తెలుగు యువత నాయకులు రామ్ లక్ష్మణ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కవలలు అయిన రామ్ లక్ష్మణ్ లకు యువతలో ఎంతోమంది అభిమానులు ఉన్నారు. వారు జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమకంటూ ఒక బ్రాండ్ ను నెలకొల్పుకున్నారు. ఈ అన్నదమ్ముల్లో లక్ష్మీపతి మున్సిపల్ కౌన్సిలర్ గా ఉన్నారు. తమ వార్డులోనే కాకుండా మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డు ఇబ్బందులు ఉన్నా స్పందించే రామ్ లక్ష్మణులు అంటే తెలియని వారు లేరు. శుక్రవారం సాయంత్రం చిత్రావతి నది వద్ద గల హారతి ఘాట్ వద్ద తమ అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకుల మధ్య కేక్ కట్ చేసి తమ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు పండ్లు పంపిణీ చేశారు.

కేక్ కట్ చేస్తున్న రామ్ లక్ష్మణ్‌లు

గడువులోగా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులు

కలెక్టర్ టిఎస్ . చేతన్

పనుల నిర్వహణ మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - బుక్కపట్నం

గడువులోపు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్. చేతన్ ఆదేశించారు. మండల పరిధిలోని చంద్రా యుని పల్లి గ్రామ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ లైనింగ్ పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్యాకేజి -4 లోని సొరంగంలో జరుగు పనులను పరిశీలించి శరవేగంగా పనులను పూర్తిచేయాలని సూచించారు. సొరంగం లోపలికి సుమారుగా 600మీ. మేరకు వెళ్లి పనులను పరిశీలించారు. ఎంత మేరకు మట్టి పని, స్టీలు, కాంక్రీట్, లైనింగ్ పనులు జరుగుతున్నాయో పరిశీలించి నాణ్యత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా ద్వారా పుంగనూరు బ్రాంచ్ కాలువ, కుప్పం బ్రాంచ్ కాలువకు నీరు వదలడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ కాలువ గట్టున ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆగస్టు 15వ తేదీ లోపల ఆ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ రాజా స్వరూప్ కుమార్, ఇఇ మురళి, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, ఇరిగేషన్ అధికారులు, బిఎస్ఆర్ ఏజెన్సీ డైరెక్టర్ జి. పూర్ణ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కదిరి - హిందూపురం రహదారి

రోడ్డులోని గుంతల్లో నాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

నాట్లు వేసి నిరసన తెలిపిన ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక వైయస్సార్ సర్కిల్ నుండి బస్టాండ్ కూడలి వరకు ఉన్న కదిరి – హిందూపురం రహదా అధ్వానంగా మారింది. వర్షపునీటితో నీటికుంటను తలపిస్తోంది. దీంతో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, ఏపీ రైతు సంఘం అధ్యక్షులు రామచంద్ర, మహిళా సంఘం అధ్యక్షురాలు శివమ్మ తదితరులు శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న గుంతలు పడిన రోడ్డులో వరి నాట్లు నాటుతూ నిరసనను వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పాడైపోయి సంవత్సరం అయినా పాలకులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమస్యను పలుమార్లు వారిని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపి కార్యదర్శి వెంకటేష్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక ధ్యేయం

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు
24న జెవివి జిల్లా మహాసభ

సమావేశంలో పాల్గొన్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఈనెల 24 వ తేదీన ధర్మవరం పట్టణంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు.శుక్రవారం ధర్మవరం పట్టణంలోని స్థానిక సూర్య స్కూల్లో జెవివి పట్టణ అధ్యక్షుడు డి.చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి జరిగే మహాసభ ఈ సారి ధర్మవరం పట్టణంలో జరపాలని పట్టణ కమిటీ తీర్మానించిందన్నారు. శాస్త్ర విజ్ఞానం పూర్తిగా వ్యాపారమయమై కార్పొరేట్ల కబంధ హస్తాల్లో బందీ అయి వాళ్లకు లాభాలు తెచ్చే వనరుగా ఉందన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకుంటామని ప్రమాణం చేసిన వాళ్ళే దానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. విద్యా, వైద్యంతో పాటూ అన్ని రంగాల్లోకి అశాస్త్రీయ భావాలను చొప్పిస్తూ అభివృద్ధి చెందిన శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ చాందస వాదానికి బలం చేకూరుస్తున్నారన్నారు. సైన్స్ ను హేళన చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా చీకటి సామ్రాజ్యాలను నిర్మించుకున్న బాబాలు, స్వామీజీలకు ప్రభుత్వాల నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా నిలవడమే కాకుండా ఒక బాబా జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించే స్థాయికి ఈ రోజు ప్రభుత్వాలు దిగజారడం బాధాకరమన్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను వ్యతిరేకించాల్సిన అవసరం వుందన్నారు. రచయితలు, కళాకారులు,విద్యార్థులు, ప్రజాస్వామిక శక్తుల మీద, ప్రశ్నించే వాళ్ల మీద దాడులు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే తత్వాన్ని కాదు మాట్లాడే స్వాతంత్ర్యాన్ని కూడా హరించే పరిస్థితి ఈ రోజు దేశంలో వుందన్నారు. ఇదంతా కూడా పాలకుల ప్రోద్భలంతోనే జరుగుతోందన్నారు. ఇలాంటి అనేక అంశాల మీద మహాసభలో చర్చిస్తున్నామన్నారు. ఈ మహాసభలో గత రెండు సంవత్సరాల్లో జిల్లా వ్యాప్తంగా జెవివి నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించుకుని రాబోయే రెండు సంవత్సరాల్లో శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ఎలా పని చేయాలనే ప్రణాళికను రూపొందించుకోవడం, నూతన కమిటీ ను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోనీ అన్ని మండలాల నుంచి వంద మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి వై. నరేంద్ర బాబు, లోకేష్, సురేష్ , బండారు మల్లికార్జున, మనోహర్, ఖలందర్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే టిడిపి ధ్యేయం

హజ్ కమిటీ ఛైర్మన్ హుస్సేన్‌బాషా

రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా మైనార్టీల సంక్షేమం కోసం టిడిపి కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హుస్సేన్ భాషా సాబ్ అన్నారు. శుక్రవారం హిందూపురం పర్యటనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసానికి ఆయన వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ముస్లీం మైనార్టీ నాయకులు, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ హుస్సేన్ భాషా సాబ్‌ను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా హుస్సేన్ భాషా సాబ్ మాట్లాడుతు గత సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ హజ్ కి వెళ్ళే యాత్రికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు సబ్సిడీని వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు. ముస్లిం మైనార్టీలు పవిత్ర హజ్ యాత్రకు వెళితే దానికి సంబంధించిన సబ్సిడీని సైతం జగన్ ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా సబ్సిడిని విడుదల చేయడం జరిగిందన్నారు. విజయవాడ నుంచి మక్కా యాత్రకు వెళ్లే ప్రతి ఒక్కరికి రూ.1లక్ష సబ్సిడిని ప్రభుత్వం ఇస్తుందన్నారు. హజ్ కు వెళ్లే యాత్రికులు ఆంధ్రప్రదేశ్ సంబంధించిన విమానాశ్రయం నుంచి వెళ్లే విధంగా దరఖాస్తులు చేసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రాల్లో నుండి హజ్ యాత్ర ప్రారంభిస్తే ఈ సబ్సిడీ వర్తించదని తెలిపారు. హజ్ యాత్రికులు ఈ విషయాన్ని గమనించి విజయవాడ నుంచి వెళ్లే విధంగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే మైనార్టీలకు ఇమామ్, మౌజన్లకు రూ.10వేల వేతనాన్ని అందించడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన రంజాన్ తోఫా, దుల్హన్ పథకాలను మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వచ్చే సబ్సిడీ రుణాలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. త్వరలోనే దుల్హన్ పథకం కూడా ప్రారంభం కాబోతుందని తెలిపారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నేతృత్వంలో జామియా మసీదు కోసం రూ.2.50 కోట్ల పనులు జరుగుతున్నాయని, మైనార్టీ సోదరుల కుటుంబాల్లో వెలుగు నింపాలని ఒక్క హిందూపురం పురపాలక సంఘంలోనే 260 మందికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్ ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ డైమాండ్ బాబా, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, హజ్ కమిటీ సభ్యుడు బాబా ఫక్రుద్దీన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్ కుమార్, మైనారిటీ పట్టణ అధ్యక్షులు ఎన్ అజ్మతుల్లా, కౌన్సిలర్ ఆయాబ్, నాయకులు నజీర్ అహ్మద్, దాదాఖాన్, అమీన్, ఫక్రుద్దీన్, భాషా, అన్వర్, ఫాజిల్, మహబూబ్ భాషా, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షులుగా రమణారెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నల్లమాడ

సింగిల్ విండో అధ్యక్షులుగా గడ్డం రమణారెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా గంగులప్ప, నాగేనాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. అందుకు ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులే నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోని అనేక సంక్షేమ ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. అనంతరం సింగిల్‌విండో అధ్యక్షులు గడ్డం రమణారెడ్డిని డైరెక్టర్లు నాగేనాయక్ , గంగులప్పను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మైలే శివశంకర్ , సర్పంచి భారతి, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, డాక్టర్ బుట్టి నాగభూషణంనాయుడు, మంజునాథ రెడ్డి, కేశవరెడ్డి, అబ్బాస్ ఖాన్, శివారెడ్డి, రామచంద్ర, రమణ, ప్రసాద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మంజు ,చంద్ర ,నాగమణి ,అరవింద్ కూటమి నాయకులు లాయర్ హరికృష్ణ, సూర్యనారాయణ, రామాంజనేయులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గుంత తీశారు.. వదిలేశారు...!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ధర్మపురంలో ప్రాంతంలోని బాలాజీ టాకీస్ రోడ్డులో గత కొంత కాలంగా నీటి సరఫరా పైప్ లైన్ లీకేజీ అవుతోంది. మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ప్రాతినిధ్యం వహించే వార్డు కావడంతో ఈ విషయాన్ని స్థానికులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు వారం రోజుల క్రితం పైప్ లైన్ మరమ్మతు పేరుతో పెద్ద పాటి గుంతను తీయించి అలాగే వదిలేశారు. పైపులైను మరమ్మతు చేశారా....? లేదా అనే విషయాన్ని సైతం ఎవరు చెప్పడం లేదు. వారం రోజులు అవుతున్నా దాన్ని పూడ్చి వేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతం అంత బురదమయంగా మారింది. రాక పోకలకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద, గుంత వల్ల పాదచారులతో పాటు ద్విచక్ర వాహనంలో వెళ్లే వారు అదుపు తప్పి కిందికి పడి గాయాల పాలయ్యారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుని, గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

.ధర్మపురంలో గుంతను తీసి వదిలేసిన దృశ్యం

నిరుపయోగంగా మారిన చెత్తతరలింపు వాహనాలు

దిష్టిబొమ్మల్లా చెత్తతరలింపు వాహనాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్మూలన వాహనాలు మూలన పడి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేస్తే ఉపయోగంలోకి వచ్చే వాహనాలను ఇలా మూలన పడేయడంపై పలువురు విమర్శిస్తున్నారు. ప్రతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు కౌన్సిలర్లు మూలనబడ్డ వాహనాలకు చిన్నపాటి మరమ్మత్తులు చేయిస్తే అందుబాటులోకి వస్తాయని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. వాహనాలు లేక పారిశుధ్య కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిది స్వచ్ఛ ఆంధ్ర బ్యాటరీ వాహనాలు, కాంపాక్ట్ వాహనాలు మరమ్మతుల కోసం మున్సిపల్ అధికారులు మూడు నెలల క్రితం టెండర్ పిలవగా ఇందులో నాలుగు వాహనాలు మాత్రమే రిపేరీకి నోచుకున్నాయి. సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా నవంబర్ నెలంతా పుట్టపర్తి భక్తులతో, పర్యాటకులతో, వీఐపీలతో సందడిగా మారనుంది. కనీసం ఆ సమయాన్ని కైనా మూలన పడ్డ వాహనాలు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు పైపల్లి గంగాద్రి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వాహనాలు, సరైన పనిముట్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు, వాహనాలు అందుబాటులో లేకుంటే ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

కడప వ్యక్తి పై ఛీటింగ్ కేసు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని తిప్పా బట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని మోసం చేసిన ఘటనలో కడపకు చెందిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సిఐ మారుతీశంకర్ తెలిపారు. బట్లపల్లిలోనిగడపర్తి హరీష్ చెందిన ఇన్నోవా కారు, దానికి ఇవ్వవలసిన బాడుగ డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని బాధితుడు కడపకు చెందిన నిమ్మకాయల వెంకట శశిధర్ రెడ్డి, కొత్తచెరువు మండలానికి చెందిన శ్రీనివాసులుపై ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తచెరువు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని మారాల రిజర్వాయర్ లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. రిజర్వాయర్ సమీపంలోని పలువురు రైతులు రిజర్వాయర్ నందు దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వెళ్లి పరిశీలించామన్నారు. గుర్తుపట్టడానికి వీలు లేకుండా, పురుషుని మృతదేహం లభించినట్లు తెలిపారు. మృతునివివరాలు వైద్యుల నివేదిక ద్వారా తెలియాల్సుంది.

దాల్‌మిల్లు సూరిపై పీడీ యాక్ట్ : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైసిపి నాయకుడు దాల్‌మిల్లు సూరితో పాటు అతని తమ్ముడు పాండుపై పలు రాష్ట్రాలలో 36 కేసులు నమోదు అయ్యాయని, ఇరువురి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారని వీరిపై పీడీయాక్ట్ నమోదు చేశామనిఎస్పీ వి రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ కొత్తచెరువు సీఐ శంకర్ తో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇరువురు కలిసి దాదాపు 200 కోట్ల రూపాయల వరకు మోసాలకు పాల్పడినట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. వారి మోసాలను ఒక్కొక్కరే వచ్చి ఫిర్యాదు చేస్తున్నడంతో మోసాలు బయటపడ్డాయని, దీనితోపాటు ఆర్థిక నేరాలకు కూడా పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందనితెలిపారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన దాల్మిల్ సూరి శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది వ్యక్తులకు, రైతులకు, విత్తన కొనుగోలు, అమ్మకాల విషయంలో మోసాలకు పాల్పడ్డాడని, అంతేకాక గతంలో అక్రమ రవాణా దోపిడీ దారులు, మాదకద్రవ్యాల నేరస్తులు, భూకబ్జాలు ,చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. , అతనితోపాటు అతని అనుచరులు 32 మందిని గుర్తించామని మరికొందరు కర్నాటక రాష్ట్రంలో ఉన్నారని వారి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కొత్తచెరువులో శ్రీ వెంకటేశ్వర దాల్ మిల్ పేరు మీద ఎంతోమంది అమాయక రైతులను, సన్నకారు వ్యాపారస్తులతో లావాదేవీలు నిర్వహించి వారికి డబ్బు ఇవ్వకుండా ఎగ్గొట్టి తప్పించుకు తిరిగేవాడని, ఎవరైనా కేసులు పెడితే స్థానిక పోలీస్ స్టేషన్లో, బాధితులతో మేనేజ్ చేసుకుని కేసుల నుండి తప్పించుకునే వాడని తెలిసిందన్నారు. దీంతో అతని బ్యాంకు లావాదేవీలు తదితర అంశాల పైన విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సూరి తమ్ముడైన పాండు పైన కేసులు నమోదయ్యాయనీ ఇతను ఇతర దేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులను జారీ చేశామనితెలిపారు. పాండు గతం నుండి కర్నాటక, తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో పలు మోసాలకు పాల్పడినట్లు కేసులు నమోదయ్యాయనితెలిపారు. వీరి కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని త్వరలో వారిని అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. దాల్మిల్ సూరి అతని తమ్ముడు పాండు తో వ్యాపార లావాదేవీలేకాక, డబ్బులు ఇచ్చి మోసపోయిన వారు ధైర్యంగా వచ్చి జిల్లా ఎస్పీ కార్యాలయానికి , లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు. ఇలాంటి వారి చేతిలో మోసపోకుండా ప్రజల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసే మార్కెట్లలోనూ సరుకులను అమ్ముకోవాలని, ఎస్పీ సూచించారు.

ఘర్షణ.. కేసులు నమోదు

ప్రజాశక్తి కదిరి టౌన్

డబ్బుల లావా దేవీల విషయంలో కులం పేరుతో దూషించి, కొట్టినారని పిర్యాదు మేరకు ఒకరు ఫిర్యాదు, దానికి వ్యతిరేకముగా వారే తమ ఇంటి వద్దకు వచ్చి గొడవపడినారని మరో వైపు పిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కదిరి మండలం చిగురుమాను తాండ గ్రామానికి చెందిన కలావాత్ రాము నాయక్ ఫిర్యాదు మేరకు గోవిందు, రామంజనమ్మ మరియు శ్రావణ్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఇదే సంఘటనలో కోడి గోవింద్ అను అతను ఇచ్చిన పిర్యాదు మేరకు రామూనాయక్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రోడ్డు ప్రమాదాలను నివారించడమే తమ లక్ష్యమని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశమైన మండల పరిధిలోని కునుతూరు గ్రామ సమీపములో శుక్రవారం మామిళ్ళపల్లి కి వెళ్లే రోడ్డు నందు వంకపై గల బ్రిడ్జికి ఒకవైపు ఎల్లో బ్లింక్ లైట్, మరోవైపు రోడ్డు సేఫ్టీ కాషన్ బోర్డ్‌ను వారు ఏర్పాటు చేశారు. దీనివల్ల వాహనదారులకు ముందుగానే ఈ సూచిక బోర్డులు కనిపించడం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త వహించే అవకాశం ఉందని వారు తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఆసుపత్రి వెబ్ సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యం కోసం వారు వైద్యుల అపాయింట్మెంట్ కోసం ఎక్కువ సమయం వృథా చేయకుండా 24గంటలకన్నా ముందుగానే తమ ఆండ్రాయిడ్ మొబైల్ లో అపాయింట్మెంట్ బుక్ చేసుకోవడం కోసం వెబ్‌సెట్ ఆవిష్కరించినట్లు డాక్టర్ సోనియా, డాక్టర్ బషీర్ తెలిపారు. ఆసుపత్రిలో వున్న అధునాతన వైద్యసేవలు, స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు,ఆపరేషన్లు, డయాగ్నొస్టిక్ పరీక్షల వివరాలతో, టోకెన్లు కూడా బుక్ చేసుకొనే సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. మరింత సులభంగా వాటిని డౌన్లోడ్ చేసుకోవడం కోసం క్యూఆర్ కోడ్ కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు తమ సమయాన్ని ఆదా చేసుకోవడం కోసం , వైద్యసేవలు పొందడం కోసం ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని వారు కోరారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - తాడిమర్రి

ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంక నాగార్జునను ఎస్సీ జనసంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. ఎస్సీ జన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ దాసుగానపల్లి కుల్లాయప్ప . రాష్ట్ర ఇన్‌ఛార్జి మాల్యవంతం రాంప్రసాద్, కర్నాటక రాష్ట్ర ఇన్‌ఛార్జి సాకే కుల్లాయప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చామలూరు రాజగోపాల్, యాలేరు పెద్దన్న, బెంగళూరు సాయి, గడ్డం రాము తదితరులు కొంక నాగార్జునను సన్మానించి అభినందనలు తెలిపారు.

నాగార్జునను సన్మానిస్తున్న నాయకులు

క్రీడలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - హిందూపురం

క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి నైపుణ్యత కనబరిచే క్రీడాకారులను రాష్ట్ర, దేశస్థాయికి ఎదిగేలా సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని టీచర్స్ కాలనీలో వెంకటేష్ వైష్ణవ్, ప్రదీప్ వైష్ణవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండోర్ క్రికెట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రికెట్ ఆట ఆడటం కోసం ప్రత్యేకమైన వలతో ఇండోర్ క్రికెట్ ను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎంతో ప్రాచుర్యం పొందిన క్రికెట్ క్రీడకు మరింత క్రీడాకారులను చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఇండోర్ క్రికెట్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయక్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.